ప్రజాశక్తి

బుధవారం 1 మే 2024

I

అల్లూరి సీతారామరాజు

మండుతున్న ఎండలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలో ఎండలు తీవ్రంగా మండుతున్నాయి. దీంతో, ఉపాధి హామీ పనులు చేసే కూలీలు పనులు చేయడానికి భయపడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో మండల వాసులు బయటకి రావడానికి భయపడుతున్నారు. వివిధ అత్యవసర పనులు ఉంటే తప్ప మిగిలిన వారు బయటకు రాకుండా నివాస గృహంలోనే ఉండిపోతున్నారు. దీంతో మండలంలోని ప్రధాన రోడ్లు జనాలు లేక నిర్మానుష్యంగా కనబడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి కొంతమంది చెట్టు నీడలను ఆశ్రయిస్తున్నారు. చిన్నారులు గెడ్డ వాగుల్లో స్నానాలు చేస్తూ వేసవి తాపానికి ఉపశమనం పొందుతున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

మోడల్ కాలనీలో సమస్యల తిష్ట

-సిసి రోడ్లు, వీధి కాలువలు లేక అవస్థలు
- అసంపూర్తిగా మరుగుదొడ్లు - తాగునీటికి వెతలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ కోసంగిపనసపుట్టు మోడల్ కాలనీలో ప్రభుత్వం కనీస మౌలిక సౌకర్యాలు కల్పించక పోవడంతో ఆ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 2014లో కురిసిన హుదూద్ తుఫానుకు పనసపుట్టు గ్రామంలోని కొన్ని నివాస గృహాలు వరద నీటితో ముంపునకు గురవడంతో ఆ గ్రామస్తులకు బల్లుగూడ సమీపంలో ప్రభుత్వం మోడల్ కాలనీని నిర్మించింది. అక్కడ గ్రామస్తుల సౌకర్యార్థం వీధి కాలువలు, సిసి రోడ్డు, తాగునీరు, మరుగుదొడ్లు తో పాటు అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికి ఏర్పాటు చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సిసి రోడ్లు, వీధి కాలువలు లేక వర్షం కురిసినప్పుడు వర్షపు నీరంతా గ్రామంలోని నివాస గృహాలకు అనుకుని నిలువ ఉండి పోతుందని, దీంతో, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. గృహాలకు అటాచ్మెంట్‌గా మరుగుదొడ్ల గోడలు మాత్రమే నిర్మించి బేసిన్లు, సెప్టిక్ ట్యాంకు నిర్మించకుండా వదిలేయడంతో మరుగుదొడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. తాగునీటి సౌకర్యార్థం గ్రావిటీ పథకం నిర్మించారు. కానీ, కుళాయిల ద్వారా అంతంత మాత్రమే నీళ్లు వస్తుండటంతో గ్రామస్తులు దాహం కేకలతో అలమటిస్తున్నారు. ఈ మోడల్ కాలనీ సుమారు కిలోమీటర్ దూరంలో అంగన్వాడి కేంద్రం ఉండటంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు అక్కడకి వెళ్లి సరుకులు తీసుకోవడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మధ్యలో కోసంగికి అనుకొని పెద గెడ్డ ఉంది. వర్షాకాలంలో గెడ్డను దాటుకొని వెళ్ల లేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. తక్షణమే సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్పందించి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిరుపయోగంగా కుళాయిలు

సౌకర్యాలు కొరవడిన మోడన్ కాలనీ ఇదే..

అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి నిర్మాణం

అభ్యర్థులు నైతిక విలువలు పాటించాలి

సాధారణ ఎన్నికల పరిశీలకులు వివేకానందన్

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికలలో అభ్యర్థులు నైతిక విలువలు పాటించి, నిజాయితీగా వ్యవహరిం చాలని సాదారణ పరిశీలకులు కె.వివేకానందన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో అరకు అసెంబ్లీ నియోజక వర్గం, పాడేరు అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన పోలింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలని చెప్పారు. సజావుగా ఎన్నికలు నిర్వహించడానికి అందరూ సహకరించాలని సూచించారు.వ్యయ పరిశీలకులు పంకజ్ సింగ్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థులు ఖర్చులను కచ్చితంగా రిజిష్టర్లలో నమోదు చేయాలని స్పష్టం చేసారు. రోజు వారీ వ్యయాలను సంబంధిత రిజిష్టరులో నమోదు చేయాలని సూచించారు. బ్యాంకు రిజిష్టర్, నగదు పుస్తకం, రోజూ వారీ వ్యయ పుస్తకాలను పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేసారు. పార్లమెంటుకు రూ.95లక్షలు, అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థులు రూ.40 లక్షల మించి ఖర్చు చేయకూడదన్నారు. ప్రతీ ఖర్చులను కొత్తగా ప్రారంభించిన బ్యాంకు ఖాతాల నుండి చెక్కు రూపంలో చెల్లించాలని పేర్కొన్నారు. నగదు రూపేణా రూ.20 వేలకు మించి చెల్లించ కూడదన్నారు. అభ్యర్థుల రిజిష్టర్లను ఈనెల 30వ తేదీ, మే 6, 11 తేదీలలో పరిశీలిస్తామని చెప్పారు.

పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ భావనా వశిస్ట్ మాట్లాడుతూ, వివి పాట్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈవిఎంలు రెండవ ర్యాండమైజేషన్, కమిషనింగ్ చేస్తామన్నారు. ఓటు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. గ్రీవెన్స్ సెల్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి సెల్ ఏర్పాటు చేసామన్నారు. 695 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసామని తెలిపారు. పోలింగ్ రోజు ఉదయం ఐదు గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించి ఏడు గంటలకు ప్రారంభించాలని సూచించారు.

అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ మాట్లాడుతూ, బ్యాలెట్ యూనిట్లో అక్షరమాల ప్రకారం బ్యాలెట్ యూనిట్లో అభ్యర్థుల పేర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పారం 7 ఎ లను ఎన్నికల కమిషన్కు పంపించడం జరిగిందన్నారు. అరకు వ్యాలీ నియోజక వర్గంలో 134, పాడేరు నియోజక వర్గంలో 86 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని, సర్వీసు ఓటర్ల వినియోగానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి తగిన విధంగా భద్రతా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఓటర్ల స్లిప్పులు పంపిణీలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనకూడదన్నారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్ల స్లిప్పులను పంపిణీ చేస్తారన్నారు. ఈ సమావేశంలో అరకు వ్యాలీ, పాడేరు నియోజక వర్గాలకు చెందిన వివిద రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వివేకానందన్

సిపిఎం ప్రజా సంఘాల్లో చేరిన గ్రామస్తులతో పార్టీ నాయకులు

వైసిపి నుండి 60 కుటుంబాలు
సిపిఎం ప్రజా సంఘాల్లో చేరిక

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు మండలం, చింతూరు పంచాయతీ పరిధి లక్ష్మీపురం (బండారుగూడెం) గ్రామంలో పూరి ముత్తయ్య (పూజారి) పూరి సుబ్బయ్య (పటేల్), సవలం సుబ్బయ్య, వంజం జగ్గయ్య, పీసం లక్ష్మయ్య ఆధ్వర్యంలో వైసిపి నుండి 60 కుటుంబాలు సోమవారం సిపిఎం ప్రజా సంఘాల్లో చేరాయి. వారికి సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, పల్లపు వెంకట్, ఎంపీటీసీ వేక రాజ్ కుమార్ తదితరులు వారికి సిపిఎం కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం లక్ష్మీపురం గ్రామస్తులు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం వైసిపి నాయకత్వాన్ని నమ్మి తమ సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఎంని వదిలి వైసిపిలో చేరామని తెలిపారు. కాని ఐదేళ్లయినా తమ సమస్యలు పరిష్కారం కాకపోగా, కొత్త సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం జరగాలంటే పోరాటం ద్వారానే సాధ్యమని ఆ పోరాటం సిపిఎం మాత్రమే చేయగలదని, అందుకే తాము తిరిగి సిపిఎంలో చేరుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పోడియం లక్ష్మణ్, పాండు సుబ్బారావు, కారం సుబ్బారావు, కారం రాజయ్య, పాండు పద్దయ్య, పాండు నాగార్జున్, పల్లపు పెద్ద రాములు, తెపల్ల లక్ష్మయ్య పాల్గొన్నారు.

మేడే వేడుకలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చెక్కల రాజకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు అధ్యక్షతన జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో రాజకుమార్ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ఈ 10 ఏళ్లలో గిరిజనులు, కార్మికులు, మహిళలు, దళితులు, మైనారిటీల హక్కులకు రక్షణగా ఉండే అనేక చట్టాలను రద్దు చేసిందన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తూ దాడులకు పాల్పడుతుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతాంగ, గిరిజన వ్యతిరేక విధానాలకు విస్తృత పోరాటాలతో సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష పార్టీ టిడిపిలో ఎవరికి ఓటేసినా రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి ఓట్లు వేసినట్లేనని పేర్కొన్నారు. మే డే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బిజెపి, టిడిపి, వైసిపిలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మేడే వేడుకలకు ఈ నెల 1న రాజవొమ్మంగి ఆర్ అండ్ బి అతిథి గృహం వద్దకు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు గొల్లపిల్లి ప్రసాదు, తురంగి కృష్ణ, మోర్తా అప్పారావు, సిగిరెడ్డి వీరబాబు, నాగు, పలివేల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నేత రాజ్ కుమార్

ఆర్థిక సాయం అందిస్తున్న మోటార్ ఫీల్డ్ యూనియన్ సభ్యులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అనంతగిరి: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన బాధిత కుటుంబానికి బొర్రా మోటార్ ఫీల్డ్ అసోసియేషన్ యూనియన్ ఆర్థిక సహాయం అందించింది. మండలంలోని ఎగువసోభ పంచాయతీ పరిధి మర్దగుడ గ్రామానికి చెందిన చిటం.సుమిత్ అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి రూ.8200 అందించినట్లు మోటార్ ఫీల్డ్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

బ్యాంకు ఖాతాల్లో పింఛను నగదు జమ

ప్రజాశక్తి పాడేరు, : ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వము జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి మే, జూన్ 2024 నెలల్లో సామాజిక భద్రతా పింఛనులు పంపిణీ చేస్తామని జిల్లా కలక్టర్ ఎం. విజయ సునీత స్పష్టం చేశారు. జిల్లాలో 1,27,435 మంది సామాజిక భద్రతా పథకం కింద పింఛన్లు పొందుతున్నారని, ఏ ఒక్కరు కూడా సచివాలయలకు వెళ్ళనవసరం లేదని జిల్లా కలక్టర్ తెలిపారు. వీరిలో 1,08,626 మంది పింఛను దారులకు వారి వారి ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని, మిగిలిన దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వీల్ చైర్, మంచానికే పరిమితం అయినవారికి డిబిటి పేమెంట్ రెజెక్ట్ అయిన తదితర 18,809 మందికి ఇంటి వద్దకే వెళ్ళి పింఛనులు పంపిణీ చేయడం జరుగుతుందని కలక్టర్ వివరించారు.

అరకులో అభివృద్ధి శూన్యం
సినీ నటి ఖుష్బూ

ప్రజాశక్తి- అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని బిజెపి జాతీయ కార్యదర్శి, ప్రముఖ సినీనటి ఖుష్బు అన్నారు. అరకు పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొత్తపల్లి గీత, అసెంబ్లీ బిజెపి అభ్యర్థి పాంగి రాజారావుల ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం అరకులోయలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 1986లో కెప్టెన్ నాగార్జున సినిమా షూటింగ్‌కు తాను అరకు వచ్చానని మళ్లీ 38 సంవత్సరాల తరువాత వచ్చానన్నారు. అప్పట్లో అరకు ఎలా ఉందో అదే మాదిరిగా ఉందని, ఎటువంటి అబివృవద్ధికి నోచుకోలేదని ఆమె అన్నారు. వైసిపి ప్రభుత్వం గిరిజన అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రధాని మోడీ వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.వి మాధవ్, టిడిపి అరకు ఇంచార్జ్ సియారి దొన్ను దొర , తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఖుష్బూ

జికె.వీధి దబ్బకోట గ్రామ సమీపంలో కొండ చీపురు పంట

ఆశాజనకంగా కొండచీపురు పంట

ప్రజాశక్తి -సీలేరు

ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు, అక్రమ రవాణా వల్ల పలు కేసులు నమోదై, జైలుకు వెళ్తున్న నేపథ్యంలో పోలీసులు గిరిజన గ్రామాల్లో కల్పిస్తున్న చైతన్యంతో గిరిజనులు ప్రత్యామ్నాయ పంటలపై దృషి దృష్టి సారిస్తున్నారు. ఆదాయం సమకూరే వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. కొండచీపురు పంటతో ఆశాజనకంగా ఆదాయం వస్తుండడంతో గిరి రైతులు దాని సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా జికె.వీధి మండలం దారకొండ పంచాయతీ దబ్బకోట గ్రామ సమీపంలోనూ, వై.రామవరం మండలం బొడ్డ గండి పంచాయితీ బచ్చునూరులోనూ గిరిజన రైతులు కొండ చీపురు సాగు చేస్తున్నారు. బచ్చునూరులో సుమారు మూడు ఎకరాల్లో కొండ చీపురు పంట సాగు జరుగుతోంది. కొండ చీపురు ఒక కట్ట ఏజెన్సీలో రూ.100 నుండి రూ.150 వరకు, మైదాన ప్రాంతంలో రూ.200 వరకు ధర పలుకుతుండడంతో ఈ పంట లాభసాటిగా ఉంటుందని గిరిజనులు గుర్తించారు. మారుమూల గిరిజన గ్రామాల్లో పండించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ పంట పండిన తరువాత కోసి కట్టలు కట్టి మైదాన ప్రాంతంలో విక్రయిస్తున్నారు. మొదటి ఏడాది కోసిన చీపురు మళ్లీ ఏడాదికి చిగురించి మళ్లీ చీపురుగా ఎదుగుతాయి. అవి పూర్తిగా ముదిరిన తర్వాత మళ్లీ కోసి విక్రయిస్తారు. ఈ పంట ద్వారా సుమారు మూడు నాలుగు సంవత్సరాల పాటు ఫల సాయం పొందవచ్చునని గిరిజనులు చెబుతున్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం చేయరూ..

ప్రజాశక్తి -సీలేరు : వైద్యం నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని జికె.వీధి మండలం జికె.వీధి పంచాయతీ పరిధి అద్దర గ్రామానికి చెందిన అంపరంగి అప్పన్న కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. అప్పన్న వంట చెరుకు కోసం కాఫీ తోటలో ఉన్న చెట్టు నరుకుతుండగా, అది పక్కన ఉన్న మరో చెట్టులో చిక్కుకుంది. దానిని లాగేందుకు ప్రయత్నిస్తుండగా, ప్రమాదవశాత్తు అది అప్పన్న గుండె భాగంపై బలంగా పడింది. బంధువులు వెంటనే నర్సీపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఛాతి సమీపంలో ఉన్న పక్కటెముకలు విరిగినట్లు గుర్తించారు. పేద కుటుంబానికి చెందిన అప్పన్న వైద్యం నిమిత్తం దాతలు ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

వైద్య సేవలు పొందుతున్న అంపరంగి అప్పన్న

FORMAT C-1

(for Candidate to Publish in Newspapers, TV)

DECLARATION ABOUT CRIMINAL CASES

(As per the Judgement Dated 25th September Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest & Ors. Vs. Union of India)

Name and address of Candidate : **APPALANARASA PACHIPENTA** S/o.(Late) APPALASWAMY, Aged 41years, BONDAM Village, PANCHAYATH Post, ARAKUVALLEY Mandal, Pin code:531149 and Resident of GUDIVADA, PADERU Mandal, ALLURI SITHARAMRAJU Dist., Andhra Pradesh State 531024

Name of the Political Party : **COMMUNIST PARTY OF INDIA (MARXIST) CPI(M)**

Name of Election : **PARLIAMENTARY CONSTITUENCY**

Name of Constituency : **01-ARAKU (ST)**

I **APPALANARASA PACHIPENTA** S/o.(Late) **APPALASWAMY**, Aged 41years, **BONDAM** village, **PANCHAYATH** and Post, **ARAKUVALLEY** Mandal, Pin code:531149 and Resident of **GUDIVADA**, **PADERU** Mandal, **ALLURI SITHARAMRAJU** Dist., Andhra Pradesh State 531024 a candidate for the above mentioned election, declare for public information the following details about my Criminal antecedents:

Sl. No	Pending Criminal Cases			Details about cases of Conviction for criminal offences	
	Name of Court	Case No and status of case	Section(s) of Acts concerned and brief description of offence(s)	Nameof Court & date (s) of order(s)	Description of offence(s) & punishment imposed
1.	JFCM Court Paderu	FIR No. Cr. No.03/2022 of Pederu Police Station, and case no. 168/2022 of JFCM Court Pederu	U/s.186,269, 270,283,34, 341,353 IPC, 3-EDA,51(b) -DMA-2005 Participate In Dharna & Rally	Not Applicable	Not Applicable
2.	JFCM Court Paderu	FIR No. Cr. No.186/2021 of Pederu Police Station	U/s.143, 145,149, 186,341, 353 IPC, 3-EDA, 51(4)-DMA-2005 Participate In Dharna & Rally	Not Applicable	Not Applicable
3.	JFCM Court Paderu	FIR No. Cr. No.162/2021 of Pederu Police Station	U/s.188, 34. 341, 447 IPC 3 EDA,51(b)- DMA-2005 Participate In Dharna & Rally	Not Applicable	Not Applicable

*In the case of election to Council of States mention the Election Concerned in place of Name of Constituency.

APPALANARASA PACHIPENTA S/o.(Late) APPALASWAMY, 01-ARAKU (ST) PARLIAMENTARY CONSTITUENCY CANDIDATE

సిపిఎం గెలుపుతోనే గిరిజన హక్కులు, చట్టాలకు రక్షణ

ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర

అరకులోయ మండలంలో ప్రచారం చేస్తున్న అప్పలనర్స, సురేంద్ర, శాంత కుమారి తదితరులు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్:ఇండియా ఫోరం అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్స గెలుపుతోనే గిరిజన హక్కులు, చట్టాలకు రక్షణ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర తెలిపారు. మంగళవారం సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్స తన సొంత గ్రామం బొందంలో ఆయన కలిసి ఎన్నికల ప్రచారం మంగళవారం చేపట్టారు. అడుగడునా మహిళలు గిరిజన సాంప్రదాయ బద్దంగా తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్పుతామని బిజెపి బహిరంగ ప్రకటనలు చేస్తుందన్నారు. రాజ్యాంగం మారిస్తే గిరిజన ప్రజల బతుకులు చిన్నాభిన్నం అవుతాయని, అందుకే ఈ ఎన్నికల్లో బీజేపీతో పాటు టిడిపి, జనసేన, వైసిపి పార్టీలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. జిఓ 3 పునరుద్ధరణకు సిపిఎం పోరాటం చేసిందని, ఏ పార్టీ కూడా మాట్లాడలేదని వీరికి ఓటు అడిగే అర్హత లేదన్నారు. బిజెపి గెలిస్తే దేశానికే పెద్ద ముప్పు ఉందని చెప్పారు.

అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి అప్పలనర్స మాట్లాడుతూ, సిపిఎం అభ్యర్థిని గెలుపుతోనే రాజ్యాంగం, గిరిజన హక్కులు, చట్టాలకు రక్షణ ఉంటుందన్నారు. గిరిజన నిరంతరం అనేక సమస్యలపై పోరాటం చేస్తుందని, ఎంపీ గా గెలిపిస్తే గెలిస్తే ప్రజా గళాన్ని పార్లమెంట్‌లో వినిపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, కాంగ్రెస్ రాష్ట్ర చైర్ పర్సన్ పాచిపెంట శాంతకుమారి, సిపిఎం నాయకులు, బుజ్జి బాబు, అప్పన్న, కొల్లోరి దొంబు, జోషీ, కాంగ్రెస్ నాయకుడు చిన్న స్వామి, సుబ్బారావు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

జి.మాడుగుల:సిపిఎం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని స్థానిక వారపు సంతలో సిపిఎం నేతలు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సాగిన ధర్మన్న పడాల్, సిపిఎం మండల కార్యదర్శి లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాని బాబు మాట్లాడుతూ, గిరిజనుల సమస్యలపై పోరాటం చేస్తున్న అప్పలనర్స, బుల్లిబాబులను గెలిపించాలన్నారు. ఈ ప్రచారంలో .సిపిఎం మండల నాయకులు కటారి కోటేశ్వరరావు, వనుగు సన్యాసిదొర, సలుగు సత్తిబాబు, ధర్మారావు, పలాస సంకయ్య .చిన్నమ్మి మత్య లింగం పాల్గొన్నారు.

పెదబయలు :మండలంలో మారుమూల పంచాయతీ కిముడుపల్లి ప్రాంతంలో సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స ప్రచారం నిర్వహించారు. గిరిజన హక్కులు, చట్టాలు పరిరక్షించు కోవాలంటే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలన్నారు.

గొంతెత్తి మాట్లాడే నాయకులను చట్ట సభలకు పంపించాలి

సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు

ప్రజాశక్తి-అడ్డతీగల

ఏజెన్సీలోని గిరిజనుల సమస్యలపైనా, హక్కులు, చట్టాలు పరిరక్షణకు చట్టసభల్లో గొంతెత్తి మాట్లాడే నాయకులను ఎన్నుకోవాలని సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు అన్నారు. కాంగ్రెస్, సిపిఐ, ఆప్ (ఇండియా వేదిక) బలపర్చిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స పాచిపెంటలను గెలిపించాలని కోరుతూ అడ్డతీగల పురవీధులలో మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అభ్యర్థి లోతా రామారావుకు అడ్డతీగల గ్రామంలో స్థానికులు హారుతులిచ్చి తిలకం దిద్ది మద్దతు తెలియజేశారు. అడ్డతీగల ప్రధాన రహదారిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో జరిగిన సభలో రామారావు మాట్లాడుతూ సిపిఎంకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేయాలని గెలిపించాలని అభ్యర్థించారు.

మారేడుమిల్లి : మండలంలోని మారేడుమిల్లి, జిఎం వలస, కుండాడ, కూడూరు, కుట్రవాడ, పీఎం కోట, భీమవరం గ్రామాల్లో ప్రజానాట్యమండలి, సిపిఎం పార్టీ నాయకులు మంగళవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు జిల్లా నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మండలంలోని టూరిజానికి ఇస్తున్న ప్రాధాన్యత గిరిజన గ్రామాల అభివృద్ధికి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం గిరిజన చట్టాలను నిర్వీర్యం చేస్తున్నా టిడిపి, వైసిపిలు నోరు మెదపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, ఏలూరు జిల్లా నాయకులు నాగమణి, నాగేశ్వరరావు, రమేష్, మారేడుమిల్లి మండల నాయకులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, వీకా రాజన్న దొర, పిఎన్ఎం కళాకారులు పాల్గొన్నారు.

ఎటపాక : మండలంలోని పాతకొండిపల్లిలో ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద సిపిఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చలంపాలెం, బండారుగూడెం, జగ్గారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. సిపిఎం అభ్యర్థులు గెలిస్తేనే గిరిజన చట్టాలు, హక్కులు కాపాడ బడతయని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రసన్న, ఇరపా సత్యం, బుద్ధుల భద్రయ్య, సోందే రామారావు, ఇరప అజయ్, కుంజా శ్రీను, పర్సిక ధర్మరాజు, వీరమ్మ పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని చిన్న మట్టపల్లి పంచాయతీ పరిధి చింతరేగుపల్లి, కన్నాయిగూడెం, నూనె వారి గూడెం గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆటపాటలతో ప్రజలను చైతన్యవంతులను చేశారు. వరదలప్పుడు తమ బాధలు చూసి సాయం చేసిన సిపిఎంకే తమ ఓట్లు వేస్తామని ఆయా గ్రామాల ప్రజలు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు. ఎంపీటీసీ ప్రదీప్ కుమార్, వడ్లది రమేష్, సర్పంచ్ సవలం మారయ్య, మాజీ ఎంపీటీసీ సున్నం నాగమ్మ, పండ వెంకటేశ్వర్లు, కె.సత్యనారాయణ, పులి ధర్మరాజు, జి.లక్ష్మణరావు, ఎ.కాంతారావు, ప్రకాశరావు, తాతబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూనవరం : పోలవరం, ఆదివాసీ చట్టాలు, పునరావాసం కోసం నిరంతరాయంగా పోరాడిన సీపీఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మండల సీపీఎం పార్టీ కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. మండలంలోని పెద్దర్కూర్, రేగులపాడు జోన్‌లలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ ప్రాంత ప్రజలను మోసం చేసిన టీడీపీ, వైసీపీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, నానుపల్లి వెంకటేశ్వరావు, పాయం సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్డతీగల ప్రధాన రహదారిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న లోతా రామారావు

హైస్కూల్లో ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-నక్కపల్లి

మండలంలోని ఉద్దండపురం హైస్కూల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని, పిల్లలను చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు డి.సత్యారావు కోరారు. మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో విద్యార్థుల ప్రవేశాలకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు. పాఠశాలలో విద్యాబోధన, సాధిస్తున్న ఫలితాలను తల్లిదండ్రులకు వివరిస్తూ తమ పిల్లలను తమ పాఠశాల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 98 శాతం సాధించి మండలంలోనే ప్రథమస్థానంలో ఉద్దండపురం హైస్కూల్ నిలిచిందన్నారు. తమ పిల్లలను పాఠశాలలో చేర్పిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, వేంకటేశ్వరరావు, నీలకంఠకుమార్, సూర్య విశ్వమ్మ, సీతాకుమారి, హరిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ నేతల ప్రచారం

ముంచింగిపుట్టు:సార్వత్రిక ఎన్నికలల్లో హస్తం గుర్తుకు తమ అమూల్యమైన ఓటువేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అరకు అసెంబ్లీ అభ్యర్థి శెట్టి గంగాధరస్వామి ఓటర్లకు అభ్యర్థించారు. మండలంలో దారెల, కిలగాడ, గేదెల బంధ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డంగి తునాథ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ హయాంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పి ప్రసాద్, బి.గిరి ప్రసాద్, మంగ్లన్న పాల్గొన్నారు.

సూక్ష్మ కళాకారుని ప్రతిభ

- చెక్కతో కార్మిక దినోత్సవ ప్రతిరూపం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, కార్పెంటర్ దార్ల రవి మే డేను పురస్కరించుకుని కార్మిక వర్గానికి తన సూక్ష్మకళతో వందన సమర్పణ చేశాడు.కార్మిక చిహ్నాలను చెక్కతో చెక్కి తన సూక్ష్మ కళను ప్రదర్శించాడు. కార్మిక శ్రమను ప్రభుత్వం గుర్తించి కార్మికులకు తోడ్పాటును అందించాలని కోరారు.

భానుడు భగభగ

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో రోజురోజుకి బానుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. మే నెల సమీపిస్తున్న తరుణంలో దంచి కొడుతున్న ఎండలకు అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఉపాధి కూలీలు ఎండ తీవ్రతను తట్టుకునేందుకు తెల్లవారు నాలుగు గంటలకే ఉపాధి పనులకు వెళుతున్నారు. ఉష్ణోగ్రతలు రోజు రోజుకి ఎక్కువ కావడంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు బెంబేలెత్తి పోతున్నారు. ఎండ తీవ్రతకు తోడు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఉదయం 11 గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. చిరు వ్యాపారులు ఎండ వేడిమికి తట్టుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

18 రకాల రేషన్ సరుకులు ఏవీ?

ప్రజాశక్తి -కోటవురట్ల: ఎన్నికల ముందు 18 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తామని ప్రచారం చేసిన వైసిపి ఐదు సంవత్సరాలు కాలంలో బియ్యం, పంచదారతో సరి పెట్టిందని మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను విమర్శించారు. రేషన్‌కు ప్రత్యేకంగా వాహనాలు దండగంటూ పలు సంఘాల నాయకులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కందిపప్పును ఆరు నెలల నుంచి సక్రమంగా పంపిణీ కాకపోవడంతో సామాన్యులు బహిరంగ మార్కెట్లో రూ.180 చెల్లించి కొనుక్కోవలసిన పరిస్థితి నెలకొందన్నారు. గోధుమ, రాగి పిండి ఎక్కడా కానరాలేదన్నారు.

'వైసిపి పాలనలో అప్పులు'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 12 లక్షల కోట్ల అప్పు చేసిందని ఎన్ఆర్ఐ ప్రతినిధులు ఆరోపించారు. మంగళవారం నర్సీపట్నం మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇంటి వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ రాజేష్‌లు మాట్లాడుతూ, వైసిపి పాలనలో అభివృద్ధి, సంక్షేమం జరగలేదన్నారు. ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారని తెలిపారు. డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలో ఎన్ఆర్ఐ ఆఫీస్ ఏర్పాటు చేసి లక్ష ఉద్యోగాలు ఇవ్వడానికి 24 గంటల హెల్ప్ లైన్ ఉండేలా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పాల్గొన్నారు.

నగదు రూపేణా పింఛన్లు అందించాలి

- ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం

ప్రజాశక్తి-పరవాడ : రాష్ట్ర ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు నగదు రూపేన నేరుగా అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, సంయుక్త కార్యదర్శి డి.డి.వరలక్ష్మి ఎన్నికల కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. సామాజిక పింఛన్ల సొమ్మును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, అంగవైకల్యం కలిగిన బ్యాంకుకు వెళ్లి డబ్బులు తెచ్చుకోవడానికి ఇబ్బంది పడతారని, అందువల్ల సచివాలయం సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు అందజేయాలని కోరారు.

ఎన్నికల కోడ్‌పై అవగాహన అవసరం

- ఎన్నికల సాధారణ పరిశీలకులు దర్జీత్ సింగ్ మంగత్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిపై సంపూర్ణ అవగాహన కలిగించుకోవాలని సాధారణ పరిశీలకులు దర్జీత్ సింగ్ మంగత్ అన్నారు. కలెక్టరు కార్యాలయంలో మంగళవారం ఎంపీ అభ్యర్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరిపైనా దుష్ప్రచారం చేయకూడదని, ప్రార్థనా స్థలాలు, మతపర ప్రదేశాలు ప్రచారానికి నిషిద్ధమని పేర్కొన్నారు. ప్రచార వాహనాలు, సామగ్రి మొదలైన వాటికి ముందుగా అనుమతి తీసుకోవలసి వుంటుందన్నారు. నిబంధనలను పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యయ పరిశీలకులు గోపాలస్వామి మాట్లాడుతూ అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా ప్రారంభించి, దాని ద్వారానే తమ ప్రచార వ్యయ లావాదేవీలు నడపవలసి వుంటుందని స్పష్టం చేశారు.

ఖర్చుకు సంబంధించి మూడు పర్యాయాలు తనిఖీలు జరుగుతాయని, నిర్దేశించిన సమయంలో అక్కౌంట్స్ అధికారికి వివరించాలని సూచించారు. రూ.10 వేల వరకు నగదు చెల్లింపులు చేయాలని, అంతకు మించితే బ్యాంకు చెక్, అకౌంట్ పే ద్వారా జరపాలన్నారు. ప్రచార సామగ్రికి ముందస్తు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి మాట్లాడుతూ అభ్యర్థులందరికీ సమాన హక్కులు, బాధ్యతలు వుంటాయన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏ విషయమైనా సంబంధిత ఎన్నికల విభాగాల నుండి పొందవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో పోలీసు పరిశీలకులు డాక్టర్ రాకేష్ కుమార్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థులు, వారి ఏజెంట్లు, ఎన్నికల విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

శివానంద్ సేవలు వెలకట్టలేనివి

- ఉద్యోగ విరమణ సభలో వక్తలు

ప్రజాశక్తి - విశాఖపట్నం : శివానంద్ కుమార్ గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖలో ఎనలేని సేవలు అందించారని, ప్రజలకు మంచి జరుగుతుందనుకుంటే ఎంత కష్టమైనా ఆ పని అయ్యే వరకూ విశ్రమించే వారు కాదని పలువురు వక్తలు తెలిపారు. ఆయన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. మంగళవారం విశాఖ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన శివానంద్ కుమార్ ఉద్యోగ విరమణ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న విశాఖ జిల్లా పరిషత్ సిఇఒ పోలినాయడు, డిపిఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ శివానంద్‌తో తమకు తక్కువ కాలం సహవాసం ఉన్నప్పటికీ ఆయన వద్ద చాలా నేర్చుకున్నామని, ఆయన చాలా మంచివారని తెలిపారు.

పనిపట్ల ఆయనకు ఎంతో నిబద్ధత ఉండేదన్నారు. విజయనగరం గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఇ బి.ఉమాశంకర్ మాట్లాడుతూ శివానంద్ తనకు చాలా కాలం నుంచీ తెలుసునని, ఇద్దరం కలిసి పనిచేశామని తెలిపారు. నమ్మిన సిద్ధాంతం మేరకు ఆయన నడుచుకున్నారని గుర్తుచేశారు. పనిచేసిన ప్రతిచోటా శివానంద్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆ శాఖ ఇఇలు, పిఆర్ ఇఇలు, డిఇలు శివానంద్‌తో ఉన్న అనుభవాలను నెమరువేసుకున్నారు అనంతరం శివానంద్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. శివానంద్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితం అందరి సహాయ సహకారాలతో విజయవంతంగా ముగిసిందన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ ఇంజినీరింగ్ సంఘం రాష్ట్ర కోశాధికారి ఎం.తిరుపతినాయడు, విశాఖ జిల్లా నాయకులు మధుకర్, అనూష, రమ్య పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యపరిచిన మహాజ్వాల శ్రీశ్రీ

శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎయు ఆచార్యులు , తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సమాజాన్ని చైతన్యపరిచిన మహాజ్వాల శ్రీశ్రీ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ 114వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ ఆధునిక సమాజాన్ని శ్రీశ్రీ చైతన్యపరిచారన్నారు. ఆయన కవిత్వం భావోద్వేగంతో కూడి మట్టి మనుషుల జీవనాన్ని దర్శింపజేయగల శక్తిని కలిగి ఉందన్నారు. మంత్రతంత్రాలతో సమాజం నడవదని, శ్రమైకజీవన సౌందర్యంతోనే సాధ్యమౌతుందని తన కవితలో నిరూపించిన దార్శనికుడన్నారు. మహా ప్రస్థానం, మరో ప్రస్థానం వంటి కావ్యాలలో గేయాలు ఎంతో మందిని కదిలించి కవిత్వం వైపు నడిపించి చాలా మందిని కవులుగా నిలబెట్టాయన్నారు. శ్రీశ్రీ కార్మికులు, కర్షకుల పక్షాన నిలబడి సమాజాభ్యుదయానికి కవిత్వాన్ని ఆయుధంగా మలుచుకున్నారన్నారు. పెట్టుబడిదారి వ్యవస్థ, బూర్జువా సమాజాన్ని కూకటివేళ్ళతో కదిలించి వేసి శ్రామిక సమాజం వెల్లివిరియాలని పిలుపునిచ్చారన్నారు. శ్రీశ్రీ అంతర్జాతీయ కవియని, నిత్య చైతన్యశీలియని సమాజానికి కనువిప్పు కలిగించిన మహా శక్తియని కొనియాడారు. సభానంతరం బైలపూడి అమర్‌నాథ్, ,కాళ్ళ సత్య, పూర్ణ, నాగదీపిక, అంజలి, దిలీప్ కుమార్ తదితర విద్యార్థులు కవితాగానం చేశారు. విజేతలైన ఎస్.దిలీప్ కుమార్, అంజలికి బహుమతులు అందజేశారు. ద్వితీయ సంవత్సర స్నాతకోత్తర విద్యార్థి సిరిశెట్టి దిలీప్ కుమార్ శ్రీశ్రీ చిత్రపటాన్ని తెలుగు విభాగానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆచార్యులు వెలమల సిమ్మన్న, డాక్టర్ అయ్యగారి సీతారత్నం, డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టెపోగు రత్నశేఖర్, పెండ్యాల లావణ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు, సింహాచల ఆలయ కమిటీ సభ్యులు జి.శ్రీనుబాబు పాల్గొన్నారు.

రాష్ట్రంలో హత్యా రాజకీయాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఎక్కడ చూసినా అరాచకాలు, హత్యా రాజకీయాలే జరుగుతున్నాయని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరిలోవలోని దళిత యువకుడు అమరేశ్వర్‌పై జరిగిన దారుణం విషయంలో కనీస చర్యలు తీసుకోపోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హత్యారాజకీయాలు, విధ్వంసాలు, ప్రశ్నించే వారిని, విపక్ష నేతలను వేధించడం, అక్రమ కేసుల్లో ఇరికించి ఇబ్బందులు పాల్జేయడ పరిపాటిగా మారిందన్నారు కార్యక్రమంలో అచ్యుతరావు, పోతనరెడ్డి, బిజెపి తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మురళీమోహన్ రాజు, జనసేన పార్టీ నాయకులు నాగలక్ష్మి, పోతు వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

జెడ్‌పి సర్వసభ్య సమావేశం

కోరం లేక వాయిదా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కోరం లేని కారణంగా మంగళవారం తలపెట్టిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి తాము ముందుకు సాగినట్టు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం.పోలినాయుడు తెలిపారు. మళ్లీ ఎపుడు నిర్వహించేదీ తర్వాత వెల్లడిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో రోడ్డు ప్రమాద మరణాలు సంభవించకుండా పటిష్టమైన రవాణా భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ అసెంబ్లీ హాల్‌లో జిల్లా రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అందుకు సంబంధించి రవాణా, జివిఎంసి, పోలీస్, ఎన్‌హెచ్ఎఐ, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సంయుక్త తనిఖీల నివేదికల ప్రకారం ఎండాడ నుంచి ఎయిర్ పోర్టు వరకు జాతీయ రహదారిపై, తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై, గాజువాక నుంచి కణితి రోడ్డులో గుర్తించిన లోపాలకు సంబంధించిన పనులను రహదారి భద్రత దృష్ట్యా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పలు రద్దీ కూడళ్ల వెడల్పు పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని జివిఎంసి అధికారులకు తెలిపారు.

జూ పార్క్, విశాఖ వేలి స్కూలు మలుపు వద్ద వేగాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని జివిఎంసి, విఎంఆర్‌డిఎ అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల రోడ్ల మార్కింగులు, స్పీడు బ్రేకర్లను అమర్చాలని, ప్రమాదం జరిగినపుడు గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న వారిని గుర్తించి వారికి ప్రభుత్వం ఇస్తున్న రూ.5 వేల పారితోషికాన్ని ఎక్కువ మందికి ఇచ్చే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఇప్పటికే ప్రారంభించి వివిధ దశలలో ఉన్న పనులను పూర్తి చేసి తదుపరి సమావేశానికి నివేదిక సమర్పించాలని, ఇప్పటి వరకు ప్రారంభించని పనులను ఎలక్షన్ కోడ్ ముగిసిన తర్వాత చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, రవాణా శాఖ ఉప కమిషనర్ జిసి.రాజారత్నం, ఆర్‌డిఒ ఆర్‌సిహెచ్.శ్రీనివాస్, డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కూనవరం :మండలంలోని కూటూరు పంచాయతీ పరిధిలోని మంగళవారం జరిగే వారపు సంతలో స్థానిక సర్పంచ్ బొగ్గా వెంకమ్మ చొరవతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని సర్పంచ్ బొగ్గా వెంకమ్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండ రెడ్డి గ్రామాలతో పలు గ్రామాల నుండి సంతకు వచ్చే ప్రజలు, వ్యాపారస్తుల కోసం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ముసిలితల్లి పండగ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెం పంటపొలాల్లో వెలిసిన ముసిలితల్లి అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. అనకాపల్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ యశ్వంత్, కొణతాల భాస్కరరావు, కొణతాల మురళీకృష్ణ, టిడిపి నాయకులు బిఎస్ఎంకె.జోగి నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ

మునగపాక : మే, జూన్ నెల పింఛన్లు లబ్ధిదారులకు నగదు రూపంలో కాకుండా డిపిటి విధానంలో వారి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు స్థానిక ఎంపీడీవో మన్మధరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల ఆధార్ నెంబర్‌తో అనుసంధానమై ఉన్న బ్యాంకు ఖాతాలో నేరుగా పింఛన్ సొమ్ము జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే వికలాంగులు, మంచం లేదా వీల్ చైర్‌కు పరిమితమైన వారికి, సైనిక సంక్షేమ పింఛన్లు అందుకుంటున్న వారికి గత నెలలో మాదిరిగానే గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లను పంపిణీ చేస్తారని తెలిపారు.

ఘన జీవామృతం తయారీపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని పి.భీమవరం గ్రామంలో రైతులకు మంగళవారం ఘన జీవామృతం తయారీ విధానంపై అవగాహన కల్పించారు. జీవామృతం వినియోగం వల్ల అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ఆవు మూత్రం, ఆవు పెడ, బెల్లం, శెనగపిండి వినియోగించి తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో శశికళ, పూజిత, పల్లవి, షారోన్ తేజస్విని, ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

బిక్కుబాబు, సోమేశ్వరరావులకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపిఎస్ ఆర్‌టిసి అనకాపల్లి డిపో కండక్టర్ కేశవ్ మటం బిక్కు బాబు (కె.బిక్కుబాబు), వెంపరాల సోమేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా వారిని మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక వివేకానంద హాల్లో ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజనల్ కార్యదర్శి పిఎన్‌వి.పరమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన సభలో ఎన్ఎంయు నాయకులు పి.సుధాకర్, వేపాడ శ్రీనివాస్, ఇయు నాయకులు ఎమ్మెస్.రావు, డిఎన్ మూర్తి, జివి.రమణ, వైఎస్ఆర్ఇయు నాయకులు ఎఎస్.పాత్రుడు, జై భీమ్ అసోసియేషన్ నాయకులు బివిఎస్ నారాయణ, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు బిఎ.రావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు వి.పోతురాజు, డిపో సిస్టం సూపర్వైజర్ కేస్ కుమార్ తదితరులు మాట్లాడారు. బిక్కు బాబు బంధువులు, నివాస ప్రాంతంలోని అపార్ట్మెంట్ వాసులు, నర్సీపట్నం డిపో నాయకులు, ఉమ్మడి విశాఖ జిల్లా డిపోల కార్మికులు, యూనియన్లకు అతీతంగా సుమారుగా 500 మంది కార్మికులు పాల్గొని సన్మానించారు.

వికలాంగుల నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : పింఛన్ల పంపిణీ విషయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యంలో అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని గాంధీ విగ్రహం ముందు వికలాంగులు మంగళవారం నిరసన తెలిపారు. ఎలక్షన్ కమిషన్ మే నెల పింఛన్లను సచివాలయ, ప్రభుత్వ సిబ్బందిని వాడుకొని పంపిణీ చేయమని, గత తప్పిద్దాలు చోటు చేసుకోకూడదని ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహార్ రెడ్డి బేఖాతర్ చేయడం దుర్మార్గమన్నారు.